క్లుప్తంగా

కుమారస్వామికి విశేషపూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామి వార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఈఓ ఎస్ లవన్న, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

ఉత్తమ డ్రైవర్‌కు సన్మానం



బాషాను సన్మానిస్తున్న ఆర్టీసీ అధికారులు

ఆత్మకూరు: పట్టణంలోని ఏపీఎస్ ఆర్టీసీ డిపో ఆవరణలో మంగళవారం జాతీయ స్థాయిలో ఉత్తమ డ్రైవర్ అవార్డు అందుకున్న ఎ.యం బాషాను ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు సన్మానించారు. ఎంప్లాయీస్ యునియన్ నాయకుడు శ్రీనివాసులు మాట్లాడుతూ.. బాషా 34 ఏళ్ల సర్వీసులో ఎలాంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా, ఎక్కువ కిలోమీటర్లు డ్రైవింగ్ చేసి, అధిక కేఎంపీఎల్ సాధించి ఉత్తమ డ్రైవర్‌గా అవార్డు అందుకోవడం సంతోషకరమన్నారు. అనంతరం బాషాను దుశ్శాలువా, పూలమాలతో సన్మానించారు.

సారాబట్టీల ధ్వంసం



సారా బట్టీలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఆత్మకూరు: మండలంలోని సిద్దపల్లి గ్రామ సమీపంలో సెబ్, స్థానిక పోలీసులు మంగళవారం నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా బట్టీలు ధ్వంసం చేసి 300 లీటర్ల బెల్లం ఊటను పారబోసి, 10 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేసినట్లు సీఐ సుబ్రహ్మణ్యం, సెబ్ సీఐ నాయుడు తెలిపారు.దాడుల్లో ఎస్‌ఐ కృష్ణమూర్తి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలి



పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, ఎస్‌ఐ

మిడుతూరు: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్ రెడ్డి అన్నారు. స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏబీఎం క్రికెట్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఎస్‌ఐ మారుతిశంకర్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి 40 జట్లు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తువ్వా లోకేశ్వరరెడ్డి, తువ్వా రామనాగేశ్వరరెడ్డి, కమతం ఎల్లారెడ్డి, రాజేష్, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

విగ్రహాలకు ధాన్యాదివాసం



ధాన్యాదివాసంలో ఉన్న విగ్రహాలు

పాములపాడు: మండలంలోని మద్దూరు గ్రామంలో ప్రతిష్ఠోత్సవ విగ్రహాలకు మంగళవారం ధాన్యాదివాసం చేశారు. గ్రామంలో శ్రీదేవి, భూదేవి, సుంకులాపరమేశ్వరి, వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ధాన్యాదివాసం చేశారు. గ్రామస్తులు ధాన్యాన్ని తీసుకువచ్చి మంత్రోచ్చరణల మధ్య విగ్రహాల పై ధాన్యం వేశారు. గ్రామంలో ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా బంధువులతో ప్రతి ఇళ్లు సందడి వాతావరణం సంతరించుకుంది.

నేడు చెన్నకేశవస్వామి కల్యాణం

మిడుతూరు: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణం బుధవారం తెల్లవారు జామున 5.20 నిముషాలకు మీనలగ్నం నందు ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు దేవాలయ ఈఓ గుర్రెడ్డి తెలిపారు. కల్యాణ మహోత్సవం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని భక్తులకు పిలుపునిచ్చారు. ఉదయం 8 గంటలకు శేషవాహనం, రాత్రి 7.30 గంటలకు హనుమత్ ఉత్సవ కార్యక్రమములు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

నెరవేరిన ఏళ్లనాటి కల

- వెలుగోడులో శ్రీ లక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం
- ఏడేళ్ల తరువాత దాదాపు రూ.2 కోట్ల ఖర్చుతో పనులు పూర్తి
- నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు
- గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఆలయం

వెలుగోడు: మండలంలోని వెంకటేశ్వరస్వామి భక్తుల ఏళ్ల నాటి కల నేటితో నెరవేరింది. దాతల సహకారం, వెలుగోడు గ్రామ ప్రజలు కలిసి స్థానిక ఆత్మకూరు రోడ్డులో శ్రీ లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ఏడేళ్ల క్రితం శ్రీకారం చుట్టగా.. అందరి సహకారంతో నిర్మాణం పూర్తయ్యింది. ప్రారంభోత్సవానికి నిర్మాణ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 3వ తేదీ నుంచి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు చేపట్టేందుకు చురుగ్గా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఆలయం ప్రారంభానికి సిద్ధమవుతోంది. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

ఐకమత్యంతో ఆలయ నిర్మాణం

గ్రామస్తుల పట్టుదలతో ఏడేళ్ల క్రితం ఆలయం నిర్మాణానికి పూనుకున్నారు. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సహకారంతో పాటు దాతల దాతతృంతో రూ.2 కోట్ల ఖర్చుతో ఆలయాన్ని సుందరంగా, ఆహ్లాదకర వాతావరణంలో నిర్మించారు. వివిధ ప్రాంతాల నుంచి విశేష విగ్రహాలు, వస్తు సామగ్రిని తెప్పించి ఆలయాన్ని తీర్చిదిద్దారు. ఏడేళ్ల తరువాత ఆలయ నిర్మాణం పూర్తి కావడంతో గ్రామస్తులగా ఎన్నో ఏళ్ల నాటి కల తమ ఆధ్వర్యంలో నెరవేరడం సంతోషంగా ఉందని ఆలయ కమిటీ అధ్యక్షుడు బళ్లాని వెంకట సత్యనారాయణ పేర్కొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక పూజలు

పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో అలువేలు మంగ పద్మావతి, గోదా సమేత వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం మే నెల 3వ తేదీ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బళ్లాని వెంకట సత్యనారాయణ తెలిపారు. బుధవారం 3వ తేదీ అనుజ్ఞాగ్రహణ, సభా ప్రార్థన, పుణ్యాహవాచనం, వాస్తు రూప ఆరాధన ఉంటుంది. 4వ తేదీ వేదపారాయణం, దివ్య ప్రబంధ పారాయణం, యాగశాల ప్రవేశం, 5వ తేదీ సుప్రభాతం, వేదపారాయణ, ద్వారా తోరణం, కలశారాధన, ప్రధాన దేవతా ఆరాధన ఉంటుంది. 6వ తేదీ సుప్రభాతం, తిరుప్పావై పఠనం, ద్వారా తోరణ పూజ తదితర కార్యక్రమాలు ఉంటాయి. 7వ తేదీ ఉదయం 5.30 గంటల నుంచి సుప్రభాతం, వేదపారాయణం, విగ్రహ ప్రతిష్ఠ, కలశారాధన నిర్వహిస్తారు.

హాజరు కానున్న ప్రముఖులు

ఈనెల 7న జరగనున్న విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి బళ్లారి స్వామి నిత్యానంద భారతి స్వామి, విష్ణుకంటి క్షేత్రం నుంచి రామ్మోహన్ స్వామి, లలితపీఠం నుంచి సుబ్రహ్మణ్యస్వామి, సద్గురు నాగలింగేశ్వర స్వాముల ఎల్లప్ప స్వామి హాజరవుతారని కమిటీ సభ్యులు తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బుడ్డా శేషారెడ్డి, శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి తదితరులు హాజరవుతారని వెల్లడించారు.

గాజులపల్లెలో పెద్దమ్మ దేవర

మహానంది: మండల పరిధిలోని గాజులపల్లె గ్రామస్తులు పెద్దమ్మ తల్లి దేవర ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించుకుంటున్నారు. 13ఏళ్ల తర్వాత గ్రామ పెద్దలు, నాయకులు, ప్రజలు అందరూ సమావేశమైన ఉత్సవాన్ని నిర్వహించేందుకు నిర్ణయించడంతో మంగళవారం ఉత్సవాన్ని వైభవంగా ప్రారంభించారు. గ్రామస్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ప్రతి ఒక్కరూ బంధుమిత్రులను పిలుచుకోవడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

రోళ్లపాడులో నాభిశిల ప్రతిష్ఠోత్సవాలు

మిడుతూరు: మండలపరిధిలోని రోళ్లపాడు గ్రామంలో బుధవారం నాభిశిల (బొడ్డురాయి) ప్రతిష్ఠ వేడుకలు పురోహితులు భరద్వాజ శర్మ, సుబ్రమణ్య శాస్త్రి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. వేడుకలలో భాగంగా మంగళవారం సర్వదేవాతా ప్రార్థనా, ప్రభాత పూజలు, హోమాలు, జలాదివాసము, ధాన్యాది వాసము, శయ్యాది వాపము తదితర విశేష పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పేరెడ్డి రామకృష్ణారెడ్డి, సర్పంచ్ రామస్వామిరెడ్డి, మాజీ సర్పంచ్ పేరెడ్డి వెంకటరామిరెడ్డి, డాక్టర్ పేరెడ్డి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనీసం రూ.250 కూలి వచ్చేలా చూడాలి



ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న ఏపీడీ

జూపాడుబంగ్లా: ఉపాధి కూలీలకు రోజుకు కనీసం రూ.250ల కూలి లభించేలా పనులు కల్పించాలని ఏపీడీ అన్వరాబేగం ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆమె మండలంలోని తాటిపాడు గ్రామంలో ఉపాధి పనులను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఉపాధికూలీలు నిర్ణీత కొలతల ప్రకారంగా పనులు చేస్తే రోజుకు రూ.271ల గిట్టుబాటు కూలి లభిస్తుందని తెలిపారు. అందులో కనీసం రోజుకు రూ.250ల కూలీ వచ్చేలా పని చేయాలన్నారు. రోజుకు కూలీ ఎంత గిట్టుబాటు అవుతుందని కూలీలను ఏపీడీ అడగగా రూ.180ల వస్తుందని తెలిపారు. ఎండలు అధికంగా ఉంటున్న నేపథ్యంలో ఉదయం 6లోగా పనుల్లోకి వచ్చి 10 గంటల దాకా చేయాలని ఉపాధి కూలీలకు సూచించారు. కార్యక్రమంలో ఈసీ నజీర్‌అహమ్మద్, టీఏ స్వాములు, ఫీల్డ్ అసిస్టెంటు లింగన్న తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలను సర్వే చేయాలి

బండిఆత్మకూరు: అకాల వర్షం కారణంగా దెబ్బతిన్న వరిపంటను సర్వే చేసి పరిహారం అందేలా చూడాలని రైతు సంఘం నాయకులు డేవిడ్, నాగరత్నం కోరారు. సోమవారం సంతజూటూరు, నారాయణాపురం గ్రామాల్లో నేలకొరిగిన వరిపంటను పరిశీలించారు.

విశాఖ ఉక్కును కాపాడుకుందాం

బండిఆత్మకూరు: విశాఖ ఉక్కును కాపాడుకోవడానికి ప్రజలందరూ సంఘటితంగా పోరాటం చేయాలని సీపీఎం నాయకులు రత్నమయ్య, రామచంద్రుడు పిలుపునిచ్చారు. మంగళవారం బండిఆత్మకూరులో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో ఎన్నో ఉద్యమాలు, 32 మంది బలిదానాల ఫలితంగా విశాఖ ఉక్కు సాధించుకోవడం జరిగిందన్నారు. అయితే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రవేటు పరం చేయడానికి పూనుకుందన్నారు. దీనిని నిరసిస్తూ బుధవారం బండిఆత్మకూరు బస్టాండ్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఫిర్యాదులపై వెంటనే స్పందించండి



రికార్డులను పరిశీలిస్తున్న సీఐ సుధాకర్‌రెడ్డి

జూపాడుబంగ్లా: పోలీసుస్టేషన్‌లో బాధితులు ఇచ్చే ఫిర్యాదుల పట్ల ఎస్‌ఐ, స్టేషన్ సిబ్బంది వెంటనే స్పందించాలని నందికొట్కూరు రూరల్ సీఐ సుధాకర్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎస్‌ఐ వెంకటసుబ్బయ్యకు సూచించారు. అనంతరం ఆయన స్టేషన్‌కు సంబంధించిన పలురకాల రికార్డులను పరిశీలించారు. కేసులు నమోదు చేసిన వెంటనే వాటికి సంబంధించిన రికార్డులు సత్వరమే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అలాగే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు.

తెలుగువర్సిటీ పీఠాధిపతికి సత్కారం



ముసుగు శ్రీనివాసరావును సన్మానిస్తున్న సిబ్బంది

శ్రీశైలం: క్షేత్రపరిధిలోని పొట్టిశ్రీరాములు చరిత్ర, సంస్కృతిక, పురావస్తు శాస్త్రం పీఠం అధిపతి డాక్టర్ ముసుగు శ్రీనివాసరావును మంగళవారం బోధన, బోధనేతర సిబ్బంది ఘనంగా సత్కరించారు. శ్రీశైలం ప్రాంగణం పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించి ఏడాది కాలం పూర్తయిన సందర్భంగా ఈ కర్యాక్రమం చేపట్టారు. వివాదాలకు తావులేకుండా, అధ్యాపకులకు, విద్యార్థులకు పూర్తి సహాయ సహకారాలు అందించినందుకు మన్ననలు అందుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇ.శోభన్‌బాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి. విశ్వనాథ్‌శాస్త్రి, జూనియర్ అసిస్టెంట్ సి.రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పింఛన్ల పంపిణీ



పాములపాడులో మంచంపై ఉన్న లింగమ్మతో వేలిముద్ర వేయిస్తున్న వలంటీర్ హుసేన్‌బీ

పాములపాడు: మండలంలో ప్రభుత్వం మంజూరు చేసిన వికలాంగ, వృద్ధాప్య, వితంతు పింఛన్ల పంపిణీ మంగళవారం కూడా ముమ్మరంగా సాగింది. ఆయా గ్రామ వలంటీర్లు తమ పరిధిలోని కుటుంబాల్లో ఉన్న లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును వారి ఇళ్ల వద్దకు వెళ్లి అందజేశారు. దీంతో పింఛన్‌దారులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. మండలంలో దాదాపు 94 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

బస్సును ఢీకొన్న బొలెరో

మహానంది: గాజులపల్లె వద్ద పెట్రోల్ బంకు సమీపంలో మంగళవారం ఆర్టీసీ బస్సు, బొలెరో వాహనం ఢీకొంది. ఈ ఘటనలో అదృష్టవశాత్తు ఎవరికి ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో ప్రయాణికులు, బొలెరోలో ఉన్న వారు ఊపిరిపీల్చుకున్నారు. ఈ విషయంపై కొద్దిసేపు ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకోగా స్థానికులు పంచాయతీ చేసి నష్టపరిహారం ఇప్పించి పంపించినట్లు సమాచారం.

శ్రీశైలంలో తాత్కాలిక దుకాణాలకు వేలం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలోని తాత్కాలిక దుకాణాలకు మంగళవారం స్థానిక మల్లికార్జున కల్యాణ మండపంలో వేలాలు నిర్వహించారు. దేవస్థానం పరిపాలనా భవనానికి ఎదురుగా ఉన్న దుకాణాలు, గంగాధర మండపం నుంచి బయలువీరభద్రస్వామి ఆలయం వరకు ఉన్న తాత్కాలిక దుకాణాలకు వేలాలు నిర్వహించారు. మొత్తం 142 దుకాణాలకు గాను 104 మంది రూ.50 వేల చొప్పున డిపాజిట్లు చెల్లించి వేలంలో పాల్గొన్నారు. దేవస్థాన సహాయ కమిషనర్ హెచ్‌జీ వెంకటేష్, రెవెన్యూ విభాగ ఏఈఓ శ్రీనివాసరెడ్డి, రెవెన్యూ విభాగ సిబ్బంది శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

జొన్నలను సద్వినియోగం చేసుకోండి



తర్తూరులో జొన్నలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ పీఎం నాగిరెడ్డి

జూపాడుబంగ్లా: ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న జొన్నలను రేషన్‌కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని తర్తూరు సర్పంచ్ పీఎం నాగిరెడ్డి కోరారు. మంగళవారం ఆయన తర్తూరు గ్రామంలో రేషన్‌కార్డు దారులకు ఉచితంగా జొన్నల పంపిణీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ఉచితంగా జొన్నలను అందజేయడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ పుల్లారెడ్డి, రామకృష్ణారెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి మంగళవారం జొన్నల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సుప్రియ, వీఆర్వో ఏసుపాదం, లక్ష్మీకాతం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మేడే ఉత్సవాలు

శ్రీశైలంప్రాజెక్ట్: మేడే ఉత్సవాలను శ్రీశైలం ప్రాజెక్ట్ కాలనీలో సీపీఎం, సీఐటీయూ, లోడింగ్, అన్‌లోడింగ్ హమాలీ వర్కర్స్ యునియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. డార్మిటరీ వద్ద ఉన్న సీఐటీయూ కార్యాలయంలో ఎర్రజెండాలను ఎగురవేసి అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ నంద్యాల జిల్లా అధ్యక్షుడు వి.ఏసురత్నం, మణి, జి.మల్లికార్జున, నాగస్వైదయ్య, నాగవెంకటేశ్వర్లు, ఎం.చిన్నమారెన్న, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: కార్మికుల హక్కులను కాలరాయటం తగదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు కర్ణ అన్నారు. మే డేను పురస్కరించుకొని మంగళవారం జూపాడుబంగ్లాలో కార్మిక జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జి.రాము, నరసింహ, ఏసన్న, శివ, గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

హిందూ శ్మశాన వాటికపై దృష్టి సారించండి



డిప్యూటీ తహసీల్దార్ వెంకట రమణకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

పాములపాడు: మండల కేంద్రంలో హిందూ శ్మశాన వాటికపై అధికారులు దృష్టి సారించాలని మాజీ ఎంపీటీసీ సభ్యుడు చౌడయ్య, మాజీ నీటి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి కోరారు. మంగళవారం గ్రామస్తులు శేషయ్య, వెంకటేశ్వరరావు, పిచ్చిరెడ్డి, సుబ్బారెడ్డి, సాయిక్రిష్ణ, నాగరాజు, రమేష్ తదితరులతో కలిసి ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో, పోలీసు స్టేషన్‌లో వినతి పత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ.. శ్మశాన వాటికకు కంచె లేకపోవడం, కంప చెట్లు విపరీతంగా పెరగడంతో లోపలికి వెళ్లేందుకు కష్టసాధ్యంగా మారిందన్నారు. దీంతో తామే చెట్ల తొలగింపునకు శ్రీకారం చుట్టామని, వ్యాపారులు వ్యర్థ పదార్థాలను పారవేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సురేష్, చంద్ర, వెంకటేశ్వర్లు, నాగోజీరావు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నీరిచ్చి రైతులను ఆదుకోండి

జూపాడుబంగ్లా: రైతుల పొలాలకు సాగునీటినిచ్చి ఆదుకోవాలని సీపీఐ జిల్లా నాయకుడు రఘురాంమ్మూర్తి, రమేష్‌బాబు కోరారు. మండ్లెం గ్రామంలో రైతులు చేపట్టిన జలదీక్ష కార్యక్రమానికి మంగళవారం వారు మద్దతు ప్రకటించారు. వారు మాట్లాడుతూ శ్రీశైలం జలాశయం నిర్మాణం కోసం సర్వస్వం కోల్పోయిన నిర్వాసితులైన రైతులకు కనీసం సాగునీటిని సరఫరా చేయలేని దుస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో రైతులు సురేష్, రాజు, రమణ, అరుణ్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

నందికొట్కూరు: ఐదేళ్లలోపు పిల్లలందరికీ ఆధార్ నమోదు చేయుటకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్న పగిడ్యాల ఎంపీడీఓ జీవీ రమణ మంగళవారం తెలిపారు. పగిడ్యాల మండలంలో 0–6 లోపు పిల్లలు 2,320 ఉన్నారన్నారు. ఈ నెల 3న బీరవోలు గ్రామంలో, 4న సంకిరేణిపల్లి, 5న లక్ష్మాపురం, 6న ప్రాతకోట, 8న ఎం ఘణపురం, 9న పగిడ్యాల, 10న ముచ్చుమర్రి, 11న నెహ్రూనగర్, 12న బీరవోలు, 15న సంకిరేణిపల్లి, లక్ష్మాపురం, 16న ప్రాతకోట, 17న ఎం ఘనపురంలో ఆధార్‌నమోదు క్యాంపులు ఉంటాయన్నారు.

7న 'చలో హైదరాబాద్'

నందికొట్కూరు: ఈ నెల 7వ తేదీన చేపట్టనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ స్వాములు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని కాన్షీరాం సర్కిల్‌లో కరపత్రాలను విడుదల చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించే బహిరంగ సభకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రవి, శేషన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో సేవలందించండి



వైద్యశాలను పరిశీలిస్తున్న డబ్ల్యూహెచ్‌ఓ బృందం

నందికొట్కూరు: వైద్యులు అంకిత భావంతో పని చేయాలని ఆంధ్రప్రదేశ్ హెల్త్ సిస్టమ్ ప్రాజెక్ట్ ఇప్లిమెంటేషన్ సపోర్ట్ మిషన్ టీం సభ్యులు డాక్టర్ గురు రాజేష్, కృష్ణ స్పష్టం చేశారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేశారు. ల్యాబ్ టెస్టింగ్‌లను, మందులను, ఆసుపత్రి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి వైద్య చికిత్సలు అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు రాయుడు, ప్రసాద్, సునిల్, ప్రవీణ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు రామిరెడ్డి

వెలుగోడు: నిరాడంబరత, నిజాయితీ, ఆదర్శం కలగలిసిన జీవనశైలి యూటీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు రామిరెడ్డిదని ఆ సంఘం మండల అధ్యక్షుడు సోమన్న కొనియాడారు. రామిరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు ఉపాధ్యాయులు నివాళులర్పించారు. సోమన్న మాట్లాడుతూ..రామిరెడ్డి 16 ఏళ్ల ఉద్యోగ సర్వీసును వదిలి యూటీఎఫ్‌లో పూర్తికాలం కార్యకర్తగా పనిచేశారన్నారు. 1982లో ఎంఎల్‌సీ గా గెలుపొంది, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి శాసన మండలి వేదికపై కృషి చేశారన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి జాకీర్ హుస్సేన్, రాష్ట్ర కౌన్సిలర్ నాగస్వామి నాయక్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ జెఎండీ రఫీ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల అపహరణ

మహానంది: ఇంటి ముందు ఉన్న ఆటోలో నుంచి ఏడు గ్యాస్ సిలిండర్లు అపహరణకు గురైన ఘటన గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బాలసుబ్రహ్మణ్యం తిమ్మాపురంలోని బిస్మిల్లా భారత్ గ్యాస్ ఏజెన్సీలో సిలిండర్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. రాత్రి తన ఇంటి వద్ద ఆటోను ఉంచగా ఆటో వెనుక ఉన్న తాళం పగలగొట్టి ఏడు సిలిండర్లను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

నేటి నుంచి ఈశ్వరస్వామి తిరునాల

కొత్తపల్లి: ఈ నెల 3వ తేదీ నుంచి మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో వెలసిన శ్రీ ఈశ్వరస్వామి తిరునాల నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ కార్తిక్ మంగళవారం తెలిపారు. ఈనెల 7వ తేదీ వరకు తిరునాల మహోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు లాల్ బహదూర్ శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 3న ఈశ్వరస్వామి కల్యాణం, 4న ప్రభోత్సవం, 5 రథోత్సవం, 6న పారువేట, 7న తీర్థావళితో ఉత్సవాలు ముగిస్తాయని వివరించారు. తిరునాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపకాంతులతో ముస్తాబుచేశారు.

పాడిపశువుల పెంపకం లాభదాయకం



లేగదూడల ప్రదర్శన తిలకిస్తున్న అధికారులు, వైస్ ఎంపీపీ, సర్పంచులు

మహానంది: పాడిపశువుల పోషణ ద్వారా పాడిరైతులకు మేలైన లాభాలు చేకూరుతాయని పశుసంవర్ధక శాఖ డీఎల్‌డీఏ ఈఓ తెలిపారు. బుక్కాపురం గ్రామంలో మంగళవారం జాతీయ పశు కృత్రిమ గర్భధారణ కార్యక్రమం ద్వారా పుట్టిన లేగదూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూరగాయాలు, ఇతర పంటల దిగుబడి ధరల మాదిరి హెచ్చు, తగ్గుల్లేకుండా పాడి పశువుల ధరలు స్థిరంగా ఉంటాయన్నారు. దేశవాళీ కాకుండా మేలుజాతి పశువులు ఇంటికి రెండు మూడు ఉంటే చాలు ఆర్థికంగా రైతులకు తోడ్పాటు ఉంటుందన్నారు. కృత్రిమ గర్భధారణ ద్వారా మేలుజాతి పశువులుగా మార్చవచ్చని, ఏ జాతిలో అయినా యాభైశాతం లక్షణాలతో ఉంటాయన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు కుంచపు లక్ష్మీనరసమ్మ, గ్రామ సర్పంచ్ కందుల వరలక్ష్మమ్మ, డీఎల్‌డీఏ వీఏఎస్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ వెంకటసుబ్బారెడ్డి, డాక్టర్ కరుణాకర్, తమ్మడపల్లె వీఎల్‌ఓ సులోచన తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో అవినీతిని అరికట్టాలి

కొత్తపల్లి: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవినీతిని అరికట్టాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్.స్వాములు, మండల ఉపాధ్యక్షుడు పి.ఏసన్న, మండల సహాయ కార్యదర్శి బి.అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సరస్వతి స్కూల్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల ఎన్ఆర్ఈజీఎస్‌లో అవినీతి చోటు చేసుకుంటుందన్నారు. కొత్తపల్లి మండలానికి తాత్కాలిక ఏపీవోలు మాత్రమే వస్తున్నారని రెగ్యూలర్ సిబ్బందిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో పి పక్కీరయ్య, కే రాజు, రమణయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణే లక్ష్యం

పాములపాడు: ఎస్సీ వర్గీకరణ సాధించుకోవడమే లక్ష్యమని ఎమ్మార్పీఎస్ లక్ష్యమని ఆ సంఘం, ఎంఎస్పీ జిల్లా కో కన్వీనర్ కోటా ప్రభాకర్, మండలాధ్యక్షుడు నాగరాజు అన్నారు. మంగళవారం మండలంలోని కోల్స్ ఆనందాపురం గ్రామంలో ఎమ్మార్పీఎస్. ఎంఎస్పీ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిషన్ 50 డేస్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

పాములపాడు: పేదలకు ఇళ్ల స్థలాలిచ్చి పట్టాలివ్వాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగానాయుడు అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని బానకచెర్ల, గుండాలనట్టు గ్రామాల్లో సుమారు 150 మందికి ఇళ్ల లేవని తెలిపారు. వారందరికి ఇంటి స్థలాలు ఇచ్చి గృహ నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు రమేష్‌బాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వర్షం.. నష్టం



వేంపెంట సమీపంలో నేలకొరిగిన వరి పైరు

పాములపాడు: మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. మంగళవారం ఉదయం కురిసిన ఓ మోస్తరు వర్షానికి పలు చోట్ల పైర్లు దెబ్బతిన్నాయి. మండలంలోని వేంపెంట గ్రామ పరిసరాల్లో వరి పైర్లు నేలకొరిగాయి. ఈ సంవత్సరం రబీలో సాగు చేసిన పైర్లు దాదాపు ప్రతి పంట మంచి దిగుబడి వచ్చింది. ఇప్పటికే దిగుబడులు ఇంటికి తెచ్చుకున్న ప్రతి రైతు లాభాలు గడించారు. అయితే పొలాల్లో ఉన్న ధాన్యం మాత్రం అకాల వర్షం కారణంగా దెబ్బతిన్నాయి. నష్ట పోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.